## క్లుప్తంగా

### అమ్మవార్ల ఆలయంలో ద్వారబంధ పూజలు



ద్వారబంధం ఏర్పాటుకు తరలివెళ్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో నిర్మిస్తున్న శ్రీ దుర్గమాంబ, కుంచమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల ఆలయ నిర్మాణంలో భాగంగా ద్వార బంధాల ఏర్పాటు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. గ్రామంలో 9 మంది దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం, పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

### వంద మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు షీలానగర్ సచివాలయ పరిధిలోని నరవ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. షీలానగర్ లైబ్రరీలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరానికి హాజరైన దాదాపు వందమందికి పైగా రోగులకు గాజువాక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.రామకృష్ణ, డాక్టర్ అనూష వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణపై వారికి అవగాహన కల్పించారు. ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స పొంది, డిశ్చార్జ్ అయిన ఒక రోగి ఇంటికి వెళ్లిన వైద్యులు ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. సూచనలు చేశారు. కార్యక్రమంలో గాజువాక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగప్పారావు, సూపర్‌వైజర్ ఈశ్వరరావు, సచివాలయాల హెల్త్ సెక్రటరీలు లత, సుధారాణి, వరహాలు పాల్గొన్నారు.

### హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



విద్యార్థులకు బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

గాజువాక: మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, మాస్కులు, టోపీలు, డ్రాయింగ్ కలర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.అరుణ్ కుమార్, ఎంఎస్‌ఎంఈ అధికారులు బి.ప్రభాకర్ కుమార్, బేగ్, సుబ్బారావు, సన్యాసిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నిరంతర అధ్యయనంతో మెరుగైన ఫలితాలు

ఏయూ క్యాంపస్: నిరంతర అభ్యసనం, అధ్యయనంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని రిటైర్డ్ డీజీపీ ఎస్.సాంబశివరావు అన్నారు. ఏయూ అర్థశాస్త్ర విభాగ సమావేశ మందిరంలో బుధవారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒక నిర్దిష్టమైన అంశంపై లోతైన అవగాహన కలగాలంటే ముందుగా పలుమార్లు దానిని చదవాలన్నారు. తద్వారా అర్థం చేసుకుని, అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందన్నారు. ముఖ్యమైన అంశాలపై నోట్స్ తయారీ, సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధం కావడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరీక్షకు సన్నాహం, చదవాల్సిన పుస్తకాలపై ఆయన అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య డి.పుల్లారావు, విభాగ ఆచార్యులు జి.నాగరాజు, డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, డాక్టర్ డి.ఆశాలత, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, పాల్గొన్నారు.

# ఇరుకు రోడ్డులో వాణిజ్య భవన నిర్మాణం

- అంతా అనధికారికం
- నిబంధనలు బేఖాతర్



అనధికారికంగా సాగుతున్న భవన నిర్మాణం

గాజువాక : జీవీఎంసీ 72వ వార్డు మెహర్‌నగర్‌లో ఒక వాణిజ్య భవన నిర్మాణంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పదడుగుల రహదారిలో చేపట్టిన బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి సంబంధిత అధికారుల అండదండలున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ నిర్మాణానికి జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు లేవని ఫిర్యాదుదారులు చెబుతున్నారు. ఈ ప్రాంతం హౌస్ కమిటీ పరిధిలో ఉన్నందున జీవీఎంసీ నుంచి నిర్మాణ అనుమతులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో నిర్మాణదారుడు అనధికారికంగా ఐదు అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టారు. భవనం బయటికి కనిపించకుండా చుట్టూ పరదాలతో కప్పి నిర్మాణం కొనసాగిస్తున్నారు. కనీస సెట్‌బ్యాక్‌లను కూడా ఉంచిన దాఖలాలు లేవు. ఆ వ్యక్తి నివాస గృహం కాకుండా వాణిజ్య భవనాన్ని నిర్మిస్తుండటంతో స్థానికుల నుంచి జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ భవనం చుట్టూ ఇప్పటికే ఉన్న భారీ భవనాల్లో వివిధ విద్యా సంస్థలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా ఆ రోడ్‌లో నడిచి వెళ్లాలన్నా ఇబ్బంది పడాల్సిన పరిస్థితిని ఎదుర్కోవాలి. మెడికల్ ఎమర్జెన్సీలో అంబులెన్స్ వెళ్లడానికి కూడా ఈ రోడ్‌లో అవకాశం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ మరో బహుళ అంతస్తుల భవనం నిర్మాణంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఐదో అంతస్తుపై చిన్న రంధ్రం పెట్టి చేతులు దులిపేసుకున్నారని స్థానికులు ఆరోపించారు. ఆ తరువాత నిర్మాణ పనులు యథాతథంగా సాగుతున్నాయని పేర్కొంటున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు విస్తృత ప్రచారం



65వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. తమ పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పట్టభద్రులను కలిసి ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ 65వ వార్డు నాయకులు రాజీవ్‌మార్గ్, భానోజీ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. నాయకులు ఎం.లోకనాథరావు, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, మద్దాల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.
- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు డ్రైవర్స్ కాలనీ, ఎల్‌బీఎస్ నగర్‌లలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటర్లను కలుసుకుని ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు నీలాతి అచ్చిబాబు, పల్లా రమణ, భాస్కరరావు, రవి కుమార్, పెంటకోట నాయుడు, సత్యం, గోపి తదితరులు పాల్గొన్నారు.

**85వ వార్డులో ఎమ్మెల్యే ప్రచారం**

అగనంపూడి: 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఓటర్లను కలుసుకొని ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రాలు అందించి సీతంరాజును గెలిపించి ఉత్తరాంధ్ర అభివృద్ధి, విశాఖ ప్రగతికి సహకారం అందించాలని కోరారు. నిర్వాసితకాలనీల్లో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- 79వ వార్డులోని లంకెలపాలెం, పరిసర గ్రామాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, వార్డు యూత్ అధ్యక్షుడు కర్రి నరసింగరావు, నాయకులు పాల్గొన్నారు.
- అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో గృహసారథులు, వార్డు కన్వీనర్లు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు సంగ్రాన నూకరాజు, గొంతిన వెంకటలక్ష్మి, బోనెల జోసెఫ్, గొంతిన శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- కూర్మన్నపాలెం: 87వ వార్డు పరిధి కణితి శెట్టిబలిజవీధిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ, పిన్నింటి సంతోష్, చిత్రాడ రాజు, ఆడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- పెదగంట్యాడ: 76వ వార్డు స్వతంత్ర నగర్‌లో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డు నాయకులు పాల్గొన్నారు. 75వ వార్డు పరిధి సీతానగరం బీసీ కాలనీలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, 65వ వార్డు భానోజీకాలనీలో వైఎస్సార్ సీపీ 65వ వార్డు కమిటీ నాయకులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

**బ్యాంకు ఉద్యోగులను కలిసిన బీజేపీ నాయకులు**

గాజువాక/పెదగంట్యాడ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు గాజువాక ప్రాంతంలోని వివిధ బ్యాంకులు, జీవిత బీమా కంపెనీల ఉద్యోగులను కలిసి ప్రచారం నిర్వహించారు. 75వ వార్డు పరిధి నెల్లిముక్కు, కోరాడ, ఎస్సీ కాలనీ, సీతానగరం తదితర ప్రాంతాల్లో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఆ పార్టీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో నాయకులు నిర్మలా కిశోర్, కోడూరు లక్ష్మీ నారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సచివాలయంలో అవగాహన కల్పిస్తున్న దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించడం నేరమని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేఎస్‌పాలెం సచివాలయంలో మహిళలకు, అనంతరం ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న వారు ఆడ శిశువులైతే గర్భంలోనే చిదిమేస్తున్నారని, దీంతో ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందని గుర్తు చేశారు. దానిని పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం 104 అంబులెన్సులో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, కృపాలిని, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# పూడిక తీసి.. వదిలేశారు



ఎదనడుపూరు గెడ్డ వద్ద ..



పెదనడుపూరు వంతెన వద్ద గెడ్డ పక్కన వదిలేసిన పూడికలు

పెదగంట్యాడ: గెడ్డల్లో తొలగించిన పూడికను తరలించకుండా అక్కడే వదిలేస్తున్నారు. ఆ పూడికలు మళ్లీ అదే గెడ్డలోకి జారుకుని, పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్లకు వరంగా మారుతోంది. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలో ఈ పరిస్థితి నెలకొంటోంది. పెదనడుపూరు, బర్మా కాలనీల్లోని ప్రధాన గెడ్డల్లో నిత్యం పూడిక పేరుకుపోతోంది. ఈ పూడికలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు టెండర్ల ద్వారా కాంట్రాక్ట్ ఇస్తారు. అయితే కాంట్రాక్టర్లు ఆయా గెడ్డల్లోని పూడికలను జేసీబీలతో తొలగించి, ఆ చెత్తాచెదారాన్ని తరలించకుండా గెడ్డ పక్కనే వదిలేస్తుండడంతో పందులు, కుక్కలు చేరి చిందర వందర చేస్తున్నాయి. దుర్వాసనతో, దోమలతో పరిసర ప్రాంతాల వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, గెడ్డల్లోంచి తొలగించిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చూడాలని కోరుతున్నారు.

# ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. తమిళనాడులోని మధురై నగరంలోని త్యాగరాజన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన యుక్తి 23 మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొన్న ఎంబీఏ విద్యార్థులు ఎం.స్వర్ణలత, కె.వి.వైష్ణవి, కె.ఆశిష్, ఎస్.భరత్‌కుమార్‌లు వివిధ పోటీలలో విజయం సాధించడంపై వీసీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఎస్.రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



### అప్పన్న సన్నిధిలో శాస్త్రవేత్త చిదంబరం

**అన్నప్రసాద పథకానికి రూ.1.5 లక్షలు అందజేత**



కప్పస్తంభం వద్ద చిదంబరం దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ప్రఖ్యాత అణు శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ మాజీ శాస్త్ర సలహాదారు, పద్మ విభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. దేవస్థానం అన్నప్రసాద పథకానికి రూ1.50 లక్షలు విరాళాన్ని ఆయన నగదు రూపంలో అందజేశారు.

# ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత



గాజువాకలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాదేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మణి



అక్కిరెడ్డిపాలెంలో మంచానికే పరిమితమైన షేక్ హుస్సేన్ బీ కి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మీప్రసన్న



దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది

గాజువాక: చికిత్స పొందుతున్న ఓ మహిళకు ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందించారు వలంటీర్. అశోక్‌నగర్ సచివాలయం పరిధికి చెందిన దుర్గాదేవి వితంతు పెన్షన్ పొందుతున్నారు. అనారోగ్యం కారణంగా గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, సచివాలయాల కన్వీనర్ ఎస్ఎండీ గౌస్ ద్వారా తెలుసుకున్న వలంటీర్ సీహెచ్ మణి ఆస్పత్రికి వెళ్లి పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాదేవి ఆరోగ్యంపై వారు ఆరా తీశారు.

**మంచానికే పరిమితమైన వృద్ధురాలికి..**

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో మంచానికే పరిమితమైన షేక్ హుస్సేన్ బీ (82)కి వార్డు వలంటీర్ సీహెచ్.లక్ష్మీ ప్రసన్న వృద్ధాప్య పింఛన్‌ను అందించారు. గృహసారథి నంబారు రాజు పాల్గొన్నారు.

**86వ వార్డులో ..**

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం పరిధిలో లబ్ధిదారులకు బుధవారం పింఛన్లు అందజేశారు. దివ్యాంగులతో పాటు వృద్ధులకు, వితంతువులకు, ఇతర లబ్ధిదారులకు వలంటీర్ పింఛన్లు అందించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

# బస్ షెల్టర్ నిర్మాణానికి ఎంపీ ఆమోదం



ఎంపీ సత్యవతికి వినతిపత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి గౌరీనగర్ జంక్షన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న బస్‌షెల్టర్, ఆర్టీసీ బస్ నిలుపుదల సమస్యకు పరిష్కారం లభించింది. ఈ మేరకు గౌరీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతిని కలిసి, వినతిపత్రం సమర్పించారు. సుమారు ఐదు వేల మంది స్థానిక ప్రజలు బస్‌షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్నారని, గౌరీనగర్ జంక్షన్ వద్ద బస్‌స్టాప్ లేకపోవడంతో బస్సులు ఆగడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ సత్యవతి బస్‌స్టాప్ నిర్మాణానికి ఎంపీ నిధులను మంజూరు చేస్తూ ఆమోదం తెలిపారన్నారు. లెటర్‌ను సంబంధిత అధికారులకు పంపించి, వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరినట్లు గౌరీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చదరం నర్సింగరావు, చదరం తులసీరామ్, పీఎస్ఎన్ మూర్తి, నరసింహమూర్తి తదితరులు తెలిపారు.

# కేంద్రం కుట్రలో భాగమే..



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామారావు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వ కుట్రలో భాగంగానే విశాఖ ఉక్కును నష్టాల బారిన నెట్టి సిక్ ఇండస్ట్రీగా ప్రకటించాలని చూస్తున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. దీనిలో భాగంగానే సంస్థలోని అనేక విభాగాలను మూసివేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 748వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షాశిబిరంలో సంస్థకు చెందిన ఈ అండ్ ఎస్ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, సేఫ్టీ, టెలిసెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో విభాగాల కార్మికులు కూర్చున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు వివిధ రీతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థల జోలికి వస్తే కార్మికులు చూస్తూ ఊరుకోరని, కార్మికులను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

# రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: నాలుగు దశాబ్దాల నాటి రామాలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి గ్రామ, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు 74వ వార్డు పరిధి పాత సిద్దేశ్వరంలోని రామాలయ నిర్మాణానికి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందజేస్తానన్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులకు రూ.1,11,116 అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, దల్లి గోవింద్‌రాజు, నాయకులు తిప్పల నితీష్‌రెడ్డి, పులి రమణారెడ్డి, కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యాన శిక్షణలో పాల్గొన్న ఔత్సాహికులు

మల్కాపురం: భగవాన్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో స్థానిక పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో బుధవారం 60వ వార్డు జవహర్‌నగర్ సన్‌రైజ్ కిడ్స్ స్కూల్‌లో ఉచిత ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ ప్రారంభించి మాట్లాడారు. శ్వాస మీద ధ్యాసే ధ్యానమని, ఇది మనిషిలో శాంతిని నింపుతుందన్నారు. తద్వారా ఆ వ్యక్తి పరులకు సేవ చేయాలనే ఆలోచనతో, ప్రేమగా మసులుకోవాలని తలంపుతో ఉంటాడన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధన కార్యక్రమం ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఇక్కడ ఉచితంగా శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల వారు అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సంప్రదించాలని కోరారు. సుమారు 50 మందికి పైగా ఔత్సాహికులు పాల్గొని ధ్యానం చేసి జ్ఞాన బోధన నేర్చుకున్నారు.

### నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా జిల్లాలోని 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్, టిగ్ వెల్డింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సీఎన్‌సీ టర్నింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్ జనరల్ అండ్ లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్‌ఎంవీ) తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణకు పదో తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. డ్రైవింగ్ శిక్షణకు 18 ఏళ్లు నిండి ఉండాలని, పదో తరగతి పాసైన, ఫెయిలైన వారితో పాటు ఐదో తరగతి చదువుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం తమ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### 3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 3న ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కేంద్రం విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలను సూచిస్తారన్నారు. దీర్ఘకాలిక రోగులు తమ మెడికల్ రిపోర్టులను తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### విద్యార్థులకు ఆరోగ్య 'యోగం'



కష్ట సాధ్యమైన ఆసనాలను అలవోకగా వేస్తున్న చిన్నారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సహకారంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న యోగ శిక్షణ సత్ఫలితాలిస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా ఉండడంతో పాటు ఏకాగ్రత సాధిస్తున్నారు. పలు ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్య ప్రయోజనం పొంది లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. ఇక్కడ విద్యార్థులకు యోగాసనాలతో పాటు క్రియలు, ప్రాణాయామం వంటి యోగాసనాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక శిక్షకులను నియమించింది. పిల్లలకు ఆరోగ్యపరమైన యోగాసనాలైన సూత్ర నీతి, క్రియ నేతి, జలనేతి వంటి ఆసనాలు వేయిస్తున్నారు. వీటిని సాధన చేయడం ద్వారా చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు దూరం కావడమే కాకుండా ఏకాగ్రత లభిస్తోందని విద్యార్థులు చెబుతున్నారు.